క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఉత్తరాధికారి ఆదేశంతో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సప్త శనివార సేవలో భాగంగా శనివారం పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మోహినీ అలంకరణ చేశారు. క్షేత్రధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ వరుసగా ఏడు శనివారాలు స్వామివారికి వివిధ రూపాల్లో సేవలను అందిచండం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎస్ఆర్ఆర్‌లో స్టాటిస్టిక్స్ దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సంఖ్యాక, గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 19వ జాతీయ స్టాటిస్టిక్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, సెమినార్ పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహిం చారు. పోటీల్లో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్టాటిస్టిక్స్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం 'బేసిక్ స్టాటిస్టిక్స్ విత్ ఆర్ సర్టిఫికెట్' కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జే నాగేశ్వరరావు, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి కే అశోక్, గణిత శాస్త్ర విభాగాధిపతి కేవీ నాగలక్ష్మి, అధ్యాపకులు జీ లలిత, కే రజనీకాంత్, ఎం. సుధాకర్, పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సంగీత సాధనతో ఉన్నత శిఖరాలు



విజయవాడ కల్చరల్: నిరంతర సంగీత సాధనతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ పేర్కొన్నారు. శ్రీసుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి మే 25వ తేదీన ఆన్‌లైన్‌లో నిర్వహించిన సంగీత పోటీ విజేతల ప్రదర్శన, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని దుర్గాపురంలోని సంస్థ కార్యాయలంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. సంగీత సమితి కార్యదర్శి సీవీ రావ్ మాట్లాడుతూ ప్రతి ఏటా చిన్నారులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను, వారి ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ చక్రధర బాబా విజేతలకు బహుమతులను అందజేశారు.

ఆకట్టుకున్న స్వరలయ సౌరభం

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ, బాల కళాకారులు తంగిరాల మైథిలి, ఎ.ధృవ, చిలకపాటి సువర్ణశ్రీ, అంబటిపూడి శివప్రియ, వీశ్యామ కృష్ణ, తనికెళ్ల హరణి, దీక్షిత్ మురారి, శ్రీవర్షిణి, సాయిబాబా, జగన్నాథరావు, వీరుభొట్ల లిఖిత సంప్రదాయ కీర్తనలను ఆలపిస్తూ తమ ప్రతిభను చాటారు. సంస్థ వైస్ చైర్మన్ చిట్టా రామలక్ష్మి నిర్వహించారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని దళిత క్రిస్టియన్ల జాతీయ ఫోరం చైర్మన్ ఐ శామ్యూల్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. హిందూ మతాన్ని ఆచరించే దళితులకే ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపచేయడం దుర్మార్గమన్నారు. శనివారం గాంధీ నగర్ ప్రెస్ క్లబ్‌లో క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీసీ), నేషనల్ ఫోరం ఫర్ దళిత్ క్రిస్టియన్(ఎన్ఎఫ్‌డీసీ) సంయుక్త ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శామ్యూల్ కుమార్, సీసీసీ కోఆర్డినేటర్ డి.డానియల్‌లు మాట్లాడుతూ దళిత క్రైస్తవులు మత ప్రాతిపదికన సంక్షేమ ఫలాలను పొందలేకపోతున్నారన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 1950లోని 3వ పేరాను రద్దు చేసి మత స్వేచ్ఛ హక్కును కాపాడాలన్నారు. సిక్కు, బౌద్ధ మతాల దళితులకు ఎస్సీ రిజర్వేషన్లు ఇచ్చినట్లే దళిత క్రైస్తవులకు కూడా ఇవ్వాలన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా, దాడులు అరికట్టాలని కోరుతూ ఈనెల 30వ తేదీ విజయవాడలోని జింఖానా మైదానంలో ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కిక్కే.. కిక్కు

- తీరుమారని వైన్ షాపుల నిర్వాహకులు
- అనుమతులు లేకుండానే పర్మిట్ రూమ్‌లు
- అధికారుల చర్యలు ప్రకటనలకే పరిమితం



ఫుడ్ జంక్షన్ వద్ద అనధికారిక పర్మిట్ రూమ్‌లో మద్యం సేవిస్తున్న మందుబాబులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గంలోని మద్యం షాపుల నిర్వాహకులు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగిస్తున్నారు. బీఆర్టీఎస్ రోడ్డు సీతన్నపేట గేటు, ఫుడ్ జంక్షన్‌లోని వైన్ షాపుల యజమానులు అధిక ఆదాయాన్ని ఆర్జించాలనే లక్ష్యంగా ఒకరితో ఒకరు పోటీ పడుతూ విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మందుబాబులకు అవసరమైన సౌకర్యాలను సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆదాయం సమకుర్చాలని తమపై పెట్టే వత్తిడిని తట్టుకునే విధంగా ఆయా వైన్ షాపుల నిర్వాహకులు కొత్త ఎత్తులకు సిద్ధమయ్యారు.

ఎక్సైజ్ అధికారుల చర్యలు శూన్యం

జిల్లాలో మద్యం షాపులు, బార్ల సమయపాలన, నియమనిబంధనలు సజావుగా అమలు చేయని షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మద్య నిషేధ, అబ్కారీ అధికారులు ప్రకటించారు. మూడు అంచెల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఈ టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా ప్రతి రోజు వైన్ షాపులు, బార్లను పర్యవేక్షించి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని కూడా ప్రకటించారు. కాని ఆ మాటలు నీటి బుడగలుగా మారాయి. దీంతో వైన్, బార్ల యజమానులు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు.



సీతన్నపేట గేటు వద్ద వైన్ షాపు గ్రౌండ్ ఫ్లోర్‌లో అనధికారిక పర్మిట్ రూమ్

కూటమి నేతల అండదండలు

వైన్‌షాపుల్లో కేవలం మద్యం అమ్మకాలు మాత్రమే చేయాలని, అక్కడ మద్యం సేవించేందుకు ఎటువంటి అనుమతులు ఉండకూడదనే నిబంధనలు ఉన్నా సెంట్రల్ నియోజకవర్గంలోని వైన్ షాపుల యజమానులకు మాత్రం అవేమి పట్టవు. కారణం స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటమే. వీరిని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్, స్థానిక పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల స్థానికులు పలు అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు అక్రమంగా ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లను తొలగించి మద్యం అమ్మకాల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మందుబాబులకు సకల సౌకర్యాలు

ఎక్సైజ్‌శాఖ నిబంధనల ప్రకారం వైన్ షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు కేవలం కౌంటర్ల ద్వారా మాత్రమే మద్యం విక్రయించాలి. కానీ కూటమి నేతల అండదండలతో అనుమతులు లేకుండా వైన్ షాపుల కింద సెల్లార్లు, షాపుల పక్కనే అనధికారికంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా మందుబాబులకు సౌకర్యవంతంగా బార్లను మించి ఫ్యాన్‌లు, కూలర్లలతోపాటు టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. వైన్ షాపుల మధ్య ఉన్న పోటీలో భాగంగా వారు ఏర్పాటు చేసిన అనధికారిక పర్మిట్ రూమ్‌ల్లోనే ఉదయం పూట మందుబాబులను అవసరమైన సిగరెట్లు, ఖైనీలు, గుట్కాలు, కూల్ డ్రింక్స్, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, వీటితోపాటు సాయంత్రం అవ్వగానే నాన్ వెజ్ రుచులను సరఫరా చేసేందుకు అక్కడే స్టాల్స్ ఏర్పాటు చేసి మరీ అమ్మకాలు సాగిస్తున్నారు.



సీతన్నపేట గేటు వద్ద పర్మిట్ రూమ్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్



ఫుడ్ జంక్షన్ వద్ద వైన్ షాపు

నూతన పార్కులు నిర్మించండి

కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కొత్త పార్కులను నిర్మించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో శనివారం వివిధ శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దాలని చెప్పారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఇంటి వద్ద సేకరించడమే కాకుండా వాటిని జిందాల్‌కి తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గార్బేజ్ తరలింపు వాహనాలను సద్వినియోగం చేస్తూ నగరంలో పరిశుభ్రత పెంచాలని సూచించారు. నగరంలో కొత్త పార్కులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తులన్నీ స్ట్రక్చరల్ స్టెబిలిటీను ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎస్టేట్ అధికారుల సమన్వయంతో పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి. సత్యకుమారి, పి. సత్యనారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ ఎస్‌వీకే చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జె. శ్రీనివాస్, సురేఖ, సామ్రాజ్యం, ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చంద్రశేఖర్, ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.



వీఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

బిల్డింగ్ వర్కర్స్ మహాసభను జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రామవరప్పాడులో ఈ నెల 30వ తేదీన జరిగే ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభ జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగే ప్రదర్శన, సభలలో నిర్మాణ రంగంలోని అన్ని వృత్తుల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మహాసభలలో భవన నిర్మాణ రంగంలో జిల్లాలో పనిచేస్తున్న సుమారు లక్ష 50వేల మంది కార్మికుల సమస్యలపై చర్చిస్తామన్నారు. నిర్మాణ కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా భవన నిర్మాణ కార్మికుల గురించి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. మహాసభ ప్రారంభం సందర్భంగా రామవరప్పాడు వంతెన సెంటర్ నుంచి ప్రసాదంపాడు ఎస్ఈఆర్ సెంటర్ మీదుగా రామవరప్పాడు రింగ్ సెంటర్ వరకు కార్మిక ప్రదర్శన చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎం కన్వెన్షన్‌లో ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా కోశాధికారి బి.బెనర్జీ, జిల్లా నాయకులు బి.గోవిందు, వి.బి.రాజు, కనకారావు, ఎం.బాబురావు, రాము తదితరులు పాల్గొన్నారు.



మహాసభ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

సారె సమర్పణకు తరలివస్తున్న భక్త బృందాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు విశేషంగా ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఉదయం 8 గంటల నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్త బృందాలు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నాయి. ప్రధాన ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని దర్శించుకుని సారెను సమర్పించాయి. సారె సమర్పణకు విచ్చేసిన భక్త బృందాలకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు.

ఆలయ ప్రాంగణంలో భక్తులకు, తమ తోటి బృంద సభ్యులకు సారె ప్రసాదాలను అందచేస్తున్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన సారె సంబరం సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగింది.

నగరంలో వసతుల కల్పనకు చర్యలు

వీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి తాము కృషి చేస్తున్నామని, నగరంలోని 64 డివిజన్లల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. అజెండాలో మొత్తం 8 అంశాలు ప్రతిపాదనకు రాగా అందులో నాలుగు ఆమోదించగా, రెండు ర్యాటిఫై చేశారు. ఒక అంశాన్ని ధ్రువీకరించగా, మరొకటి రికార్డు చేశారు.

ప్రధానాంశాలు :

- వీఎంసీ పరిధిలోని సర్కిల్–3 ఏరియాల్లో పార్కు సెక్షన్ విభాగం, ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.5 లక్షలలోపు నామినేషన్ పద్ధతిపై 114 పనులు చేయగా సంబంధిత నిధులను వీఎంసీ జనరల్ బడ్జెట్ నుంచి మంజూరు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై స్థాయీ సంఘం సభ్యులు చర్చించి తీర్మానాన్ని ఆమోదించారు.
- నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో గ్రీనరీ అభివృద్ధి చేయడానికి గ్రీన్‌బెల్ట్, పార్కులు, సెంట్రల్ డివైడర్లలో మొక్కలను నాటేందుకు, వాటిని సంరక్షించేందుకు ఎంపానల్ ఆమోదించిన ముగ్గురు హార్టీకల్చర్ అధికారులకు 01.07.2025నుంచి 30.06.2026 వరకు ఏడాదిపాటు కాంట్రాక్ట్‌ను ఉద్యోగుల వేతనాలు ఒక్కొక్కరికీ నెలకు రూ. 34వేలు చొప్పున ముగ్గురుకి ఏడాదికి రూ.12.29 లక్షల నిధులను కార్పొరేషన్ జనరల్ ఫండ్స్‌నుంచి నిధులు మంజూరు చేయాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానించారు.
- సెంట్రల్ నియోజకవర్గం 1వ డివిజన్ గుణదలలోని నున్నరోడ్డు నుంచి ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూపొందించిన అంచనాలు రూ. 45.21 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.



కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన స్థాయీ సంఘం సమావేశం

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయం సరఫరా చేయడమే లక్ష్యంగా విద్యుత్ సిబ్బంది ఉండాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ పుల్లారెడ్డి ఆదేశించారు. స్థానిక సూర్యారావు పేట సెక్షన్ పరిధిలోని చుట్టుగుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పుల్లారెడ్డి శనివారం పరిశీలించారు. సూర్యారావుపేట సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లోడ్ల పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. చుట్టుగుంట సబ్‌స్టేషన్ ఆవరణను మొత్తం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్లల్లో లోడు అధికమైతే కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వచ్చే వేసవి నాటిని విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేసి దానికి తగినట్లుగా చర్యలు తీసుకునేలా ప్రతిపాదనలు రూపొందించుకోవాలన్నారు. విద్యుత్‌మీటర్ల రిపే ర్లు వంటి అంశాలపై సిబ్బంది తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వినియోగదారుల సేవలకు విద్యుత్ సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కొత్తగా విద్యుత్ సర్వీస్ కోసం దరఖాస్తు చేసుకున్న 48 గంటల వ్యవధిలో కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని సూచంచారు. సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింట్‌నెన్స్ నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేసే సమయాలను ముందుగానే ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారుల ఫోన్లకు ఎస్ఎంఎస్ పంపడం, వార్త పత్రికల ద్వారా ముందుగానే తెలియజేయాలని కోరారు. ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ఎన్టీఆర్ జిల్లా ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈలు రవీంద్ర బాబు, ఏడీఈ శ్రీధర్, సూర్యారావుపేట సబ్‌స్టేషన్ ఏఈ వెంకట్రామ్‌తో పాటుగా విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. చుట్టుగుంట విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణ మొత్తం పరిశుభ్రతతో పాటుగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి అందంగా ముస్తాబు చేయడంతో ఏఈ వెంకట్రామ్‌ను సీఎండీ పుల్లారెడ్డి అభినందించారు.



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న పుల్లారెడ్డి

స్వయం ఉపాధికి ఫిక్కీ ఫ్లో శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూగ, బధిర విద్యార్థులు, మహిళలు స్వయం ఉపాధి పొందేలా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్, సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఫిక్కీ ఫ్లో ఇనీషియేటింగ్ హెడ్ విజయలక్ష్మి మాట్లాడుతూ శిక్షణలో భాగంగా మూగ, బధిర విద్యార్థులు, మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, గూగుల్ స్కెచప్, ఆటోక్యాడ్, టై అండ్ డై, స్క్రీన్ ప్రింటింగ్ నేర్పిస్తామని తెలిపారు.

శృతిలయ సమన్వితం త్యాగరాజ సంకీర్తనం

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 108, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వర్ధంతి సందర్భంగా దుర్గాపురంలోని భారతీ తీర్థ శ్రవణసదనంలో నిర్వహిస్తున్న ఆరాధన సంగీతోత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. శనివారం అలంకార్ సెంటర్‌లోని గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు విగ్రహం వద్ద సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ ఆధ్వర్యంలో గురుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు విజయవాడ వాసి కావడం మనందరి అదృష్టమన్నారు. అనంతరం జరిగిన సంగీత కచేరీలో బీవీ విద్యాసాగర్, వై నందకిషోర్, బుర్రా నీలకంఠ శాస్త్రి, పసుమర్తి పావని, విఖ్యాత సంగీత విద్వాంసులు డీవీ మోహనకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సెంట్రల్ కమిటీల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ క్లస్టర్ కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. క్లస్టర్–1 ఉపాధ్యక్షులుగా ఎస్ మనోహర్, టీఎల్ రాఘవ, ప్రధాన కార్యదర్శులుగా కోలాంటి రవి, మానికొండ సాంబ శివరావు, ఆలుగోలు కరుణాకర్, కోశాధికారిగా మానం గంగాధర్, కార్యదర్శులుగా తాటి రాంబాబు, ఎం నాగభూషణం, బంకా వెంకటేశ్వర్లు, ఆత్మకూరి సురేష్, శేషన్ మురళీలను నియమించారు. వీరితోపాటు మరో 12 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమించారు.

క్లస్టర్ – 3 కమిటీ..

క్లస్టర్ – 3 కమిటీ ఉపాధ్యక్షులుగా గుడిపాటి చంద్రశేఖర శర్మ, తేలుకుట్ల వెంకట రాములు, ప్రధాన కార్యదర్శులుగా జేపీ నాయుడు, ఉప్పులేటి రాజు, ఎస్‌కే వలి, కోశాధికారిగా భూమా రమేష్, కార్యదర్శులుగా జే రంగారెడ్డి, జీ రాంబాబు, పీ దుర్గారావు, యర్ల దుర్గారావు, పల్లెపోగు దాసు నియమితులయ్యారు. వీరితోపాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మరో 15 మంది నియమితులయ్యారు.

సెప్టెంబరు 21న జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 21వ తేదీన తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కె.ఎస్.ఎస్.ప్రసాద్ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రైవేట్ పాటల వీడియోల పోటీలు, రీల్స్ పోటీలు జరుగుతాయన్నారు. షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5వేలు, ప్రైవేట్ పాటల వీడియోల పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడో బహుమతి రూ.2వేలు, అలాగే రీల్స్ పోటీలలో మొదటి బహుమతి రూ.3వేలు, రెండో బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి వెయ్యి రూపాయలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ లోగా షార్ట్ ఫిల్మ్ గాని, ప్రైవేట్ పాటల వీడియో గాని, రీల్స్ గాని పంపాలని కోరారు. ఈ సమావేశంలో షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీవీ రాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్ ఆనంద్ కొప్పుల, వర్కింగ్ సెక్రటరీ బి.అశోక్, కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ పడకుండా పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలు వీఎంసీకి చెల్లించే వివిధ పన్నులు వడ్డీ పడకుండా చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీనే ఆఖరు గడువని కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలందరూ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, డ్రైనేజ్ పన్ను, నీటి పన్ను సకాలంలో చెల్లించాలని సూచించారు. వడ్డీ పడకుండా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్షయ వ్యాధి పై అవగాహన పెంపొందించుకోవాలని టీబీ ఎస్‌టీఎస్ బీ ఉషారాణి సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నగరంలోని హనుమాన్‌పేట, అయోధ్యనగర్, ముత్యాలంపాడు, బాప్టిస్ట్ పాలెం యూపీహెచ్‌సీలలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాల పాటు దగ్గు, జ్వరం రావడం, రాత్రివేళల్లో చమటలు పట్టడం, కళ్లిలో రక్తం పడటం, ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, బరువు తగ్గిపోవడం, ఆకలి లేకపోవడం, అలసట, మెడ మీద గడ్డలు ఉండటం క్షయ వ్యాధి లక్షణాలుగా తెలిపారు. భవిష్యత్తులో టీబీ వస్తుందా లేదా అనే నిర్ధారణకు గానూ సైటీబీ ఇంజెక్షన్ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామన్నారు. ఎవరికైనా టీబీ లక్షణాలు కనిపిస్తే ఆందోళన చెందాల్సిన పనిలేదని డాట్స్ చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. అనంతరం సైటీబీ ఇంజెక్షన్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ నాగేశ్వరరావు, టీబీ హెచ్‌వీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.